క్లుప్తంగా...

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



గోల్కొండ: బీజేపీ నాయకురాలు బండారు శృతి ఆధ్వర్యంలో శుక్రవారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి రాత్రినుంచి మీరాలం మండి ఆలయం మూసి వేత



మీరాలంమండి దేవాలయం

చార్మినార్: నగరంలో ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయాన్ని శనివారం రాత్రి 7–05 గంటల నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు మూసి వేయనున్నారు. ఈ నెల 28న రాత్రి నుంచి పాక్షిక చంద్ర గ్రహణం నేపథ్యంలో దేవాలయాన్ని మూసి వేయనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో అలయ్ బలయ్

రాజేంద్రనగర్: దసరా పండుగ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాజేంద్రనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం హిమాయత్‌సాగర్ సోడమ్మ గుట్టపై రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ డి.సత్యనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సోదరులంతా సమావేశమై దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటూ.. ఒకరికొకరు అలై బలై చేసుకున్నారు. అనంతరం ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. కులస్తులంతా ఏకతాటిపై ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరికి మద్దతు ఇవ్వాలనే విషయమై ముమ్మరంగా చర్చించారు. కులస్తులు నియోజకవర్గంలో ఏ పార్టీ నుంచి పోటీ చేసినా.. మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బైరమని మల్లేష్‌ముదిరాజ్, మణికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.నరేందర్‌ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ పెద్దలు ఎం.మహాత్మరావు, కె.నారాయణ, కె.యాదయ్య, ఎం.నర్సింగ్‌రావు, బాలరాజు, రమేష్, ఎం.రాజు ముదిరాజ్, కె.నరసింహ, జి.నర్సింగ్‌రావు, చంద్రకాంత్, శివ, కొండల్ తదితరులున్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించాలి

శంషాబాద్ రూరల్: వచ్చే 30 రోజులు మనందరికి చాలా కీలకమని, నిద్రాహారాలు మానుకునైనా సరే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపుకోసం కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దషాపూర్ వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జరిగిన ప్రజా ఆశీర్వాదసభలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వేదికపై ఉన్న తనతో పాటు ఎమ్మెల్యేతో సహా ప్రతి ఒక్కరూ కార్యకర్తలేనని భావించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. ప్రచారం సాగాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సంపదను సృష్టించి సంక్షేమాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఇప్పటి వరకు అభ్యర్థుల ఎంపిక కూడా చేయలేదని, యుద్ధానికి మనం ఎప్పటి నుంచో సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టో తయారు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శంషాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారని తెలిపారు.

ఆధారాలుంటేనే రాయండి : ఎమ్మెల్యే మండిపాటు

తాను కబ్జాలకు పాల్పడుతున్నానని రాస్తున్న వార్తల్లో వాస్తవం లేదని.. ఆధారాలు ఉంటే రాసుకోవచ్చని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పదేళ్ల నుంచి కృషి చేశానన్నారు. ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే..

ఎన్నికలప్పుడే వస్తారు.. తర్వాత పట్టించుకోరు..

- శిథిలావస్థకు చేరుకున్న ఎస్వీ నగర్ భవన సముదాయం..
- పెచ్చులూడుతున్న గోడలు...
- సమస్యలు పరిష్కరిస్తేనే ఓట్లంటున్న ఎస్వీనగర్ బస్తీ ప్రజలు...

చార్మినార్: త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంగా స్థానిక నాయకులు తమ బస్తీలో కనీస సౌకర్యాలను కల్పించడానికి ముందుకు వస్తేనే..ఓట్లు వేస్తామంటున్నారు ఎస్వీనగర్ బస్తీవాసులు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా..తమకు అది చేస్తాం.ఇది చేస్తాం అంటున్నారు తప్పా...గెలిచిన తర్వాత ఎవరూ ఏమీ చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా తాము ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ..ఏ రాజకీయ పార్టీ నాయకులు తమ గోడును వినిపించుకోవడం లేదంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ సైతం తమ సమస్యలను పరిష్కరించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే నాయకులను నిలదీస్తామంటున్నారు. కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు వేయించుకుంటున్నారని..అనంతరం మళ్లీ తమ బస్తీ వైపు చూడడం లేదంటున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరినప్పటికీ..కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి తమ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు వచ్చే నాయకుడికే ఓట్లు వేస్తామని బస్తీ ప్రజలు ముక్త కంఠంతో పేర్కొన్నారు.

శిథిలావస్థలో భవన సముదాయం..

చార్మినార్ నియోజక వర్గం–పురానాపూల్ డివిజన్‌లోని ఎస్వీనగర్ బస్తీలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన భవన సముదాయంలోని గవర్నమెంట్ క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పటికే బాల్కనీ ప్రహరీ కూలిపోయింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. మట్టిపైపులు పగిలిపోయాయి. డ్రైనేజీ నీరు సక్రమంగా ముందుకు వెళ్లక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో జోరుగా కురిసిన వర్షానికి శిథిలావస్థకు చేరిన ఒక క్వార్టర్ ముందు భాగం గోడల పెచ్చులూడి కింద పడడంతో ఒకరికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరిన తమ క్వార్టర్లకు వెంటనే ప్రభుత్వ ఖర్చులతో మరమ్మతు చేయించాలని ఇక్కడి పేద ప్రజలు కోరుతున్నారు. తామంతా కేసీఆర్ ప్రకటించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు.




పురానాపూల్ స్వామి వివేనందనగర్‌లో శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్న క్వార్టర్స్ భవనాలు

భయం.. భయంగా బతుకుతున్నాం



శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్న బస్తీ క్వార్టర్లకు వెంటనే మరమ్మతులు చేయి ంచేందుకు ముందుకు వచ్చే వారికే ఓటేస్తాం.వర్షాలు కురిసినప్పుడల్లా...తామంతా బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం. ఎప్పుడు భవనం గోడల పెచ్చులు ఊడుతాయోనని భయం, భయంగా ఉంది. గతంలో ఉన్నట్టుండి గోడ పెచ్చులూడి ఒకరికి గాయాలయ్యాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నాం. ఎన్నికలు వచ్చినప్పుడే బస్తీలో పర్యటిస్తున్న నాయకులకు ఈసారి గట్టిగా బుద్ధి చెబుతాం.

– పెంజర్ల శ్యామ్‌కుమార్, ఎస్వీనగర్ బస్తీ

రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తాం..

- మెట్టు సాయికుమార్‌కు బుజ్జగింపులు
- మల్లు రవి భరోసా



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి భంగపడ్డ రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి బుజ్జగించారు. శుక్రవారం ఆగాపురా ప్రాంతంలోని మెట్టు సాయి కుమార్ ఇంటికి వచ్చిన మల్లు రవి ఆయనతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, రాష్ట్రంలోని గంగపుత్రులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తామని మల్లురవి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. గోషామహల్‌లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని మెట్టుసాయికుమార్‌ను కోరారు. పదేళ్లకు పైగా మెట్టు సాయికుమార్ కాంగ్రెస్ పటిష్టతకు, ప్రజా సమస్యల పోరాటానికి ఎంతో కృషి చేశారని మల్లురవి కొనియాడారు.



మెట్టు సాయికుమార్‌తో సమావేశమైన టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి తదితరులు

కార్వాన్‌లో మజ్లిస్, బీజేపీల మధ్య హోరాహోరి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ప్రధాన ప్రత్యర్థులైన మజ్లిస్, బీజేపీల మధ్య ఈసారి కూడా హోరాహోరిగా పోటీ జరిగే అవకాశం ఉంది. 2018 ఎన్నికల్లో మజ్లిస్, బీజేపీల తరపున పోటీ చేసిన వారే ఈసారి కూడా తలపడుతున్నారు. మజ్లిస్ అభ్యర్థి కౌసర్‌మోహియుద్దీన్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. పార్టీ బలంతో పాటు అనుచర గణం ఉన్న కౌసర్‌మోహియుద్దీన్ హ్యాట్రిక్ విజయంపై గురిపెట్టారు. అయితే మజ్లిస్ అధిష్టానం మాత్రం ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించకపోయినా కార్వాన్‌లో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కౌసర్‌మోహియుద్దీన్ ప్రతినిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. ఈ నియోజకవర్గంలో 1999 నుంచి వరుసగా మజ్లిస్ విజయం సాధిస్తూ వస్తోంది. కాగా బీజేపీ కార్వాన్ నుంచి పోటీకి సీనియర్ నాయకుడు టి.అమర్‌సింగ్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించింది. అపార రాజకీయ అనుభవం, రాజకీయాల్లో ఎత్తుకుపైఎత్తులు వేయడంలో దిట్టగా అమర్‌సింగ్‌కు పేరుంది. ఆయన గతంలోనూ కార్వాన్ నుంచి పోటీ చేశారు. అయితే ఈసారి దేశవ్యాప్తంగా ప్రధాని మోదీకి ఉన్న ఆదరణ, రాష్ట్రంలో బీజేపీ అనుకూల పవనాలు ఉండడంతో గెలుపుపై ఆయన ధీమాగా ఉన్నారు. ఈసారి తన చిరకాల ప్రత్యర్థిపై ఎలాగైనా విజయం సాధించి మజ్లిస్‌ను దెబ్బకొట్టాలని ఆయన పావులు కదుపుతున్నారు. జియాగూడా, కార్వాన్, లంగర్‌హౌజ్ డివిజన్లలో బీజేపీకి పట్టు ఉంది. గతంలో లంగర్‌హౌజ్ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా విజయం సాధించారు. ఈసారి జియాగూడ డివిజన్‌కు కూడా బీజేపీ అభ్యర్థి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌లలో ప్రచారం నిర్వహించి అక్కడ కూడా ఓట్లు సాధిస్తే తమ విజయం సులువు అవుతుందని అమర్‌సింగ్ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఏదేమైనా ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నా కూడా ప్రజల ఆయనను ఏ విధంగా ఆదరిస్తారో ఎన్నికల తర్వాతే తెలుస్తుంది. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన నాయకులు లేకపోవడంతో మజ్లిస్, బీజేపీల మధ్యనే పోటీ ఉంటుందన్న విషయం స్పష్టమవుతోంది.

సేవ చేసే వారికే ప్రజల్లో గుర్తింపు



షకీల్ ఆలీ ఖాన్‌కు అవార్డు అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సేవ చేసే వారికే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ రేతి గల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మజ్లిస్ సీనియర్ నాయకుడు షకీల్ ఆలీ ఖాన్‌కు ఉత్తమ సేవా అవార్డు అందించారు. టీఎఫ్‌సీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మజ్లిస్ పార్టీలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి అవార్డులు, మెమొంటోలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షకీల్ ఆలీ ఖాన్ గత రెండు దశాబ్దాలుగా మజ్లిస్‌లో ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. పార్టీ అధిష్టానం ఆయనను క్రమ శిక్షణ గల కార్యకర్తగా గుర్తించిందన్నారు. మజ్లిస్ ఎప్పుడు కూడా పని చేసే కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టీఎఫ్‌సీవో చైర్మన్ మహ్మద్ నజీబ్, మజ్లిస్ నాయకులు ఆరూన్‌ఫరాన్, ఖాలేద్ ఆలీ ఖాన్, జుబేర్ బిన్ అవద్, డాక్టర్ మియాజ్ అహ్మద్ ఖాన్, షబ్బీర్ ఖాన్, పి.శివశంకర్, ఏ.సునంద తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి భజరంగ్‌సేన మద్దతు

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌కు భజరంగ్‌సేన మద్దతు ఇస్తుందని సేన రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం గౌలిగూడ రామ మందిర్ నుంచి బీజేపీ అభ్యర్థి రాజా సింగ్‌లతో చేపట్టిన పాదయాత్రకు భజరంగ్‌సేన మద్దతు పలికింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.... గోషామహల్ నియోజకవర్గ ప్రజలు రాజా సింగ్ విజయానికి కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి భయంతోనే అభ్యర్థిని ప్రకటించలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఇక్కడ బీజేపీ గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, సేన నాయకులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న రాజాసింగ్

రూ. 5 లక్షల నగదు పట్టివేత

జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో కట్టమైసమ్మ దేవాలయ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. రహింపురాకు చెందిన మేకల మండీ వ్యాపారి రూ.5 లక్షల నగదుతో పురానాపూల్ వెళ్తుండగా కట్టమైసమ్మ దేవాలయ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇళ్ల నిర్మాణానికి అనుమతి తప్పనిసరి



సయ్యద్ సైదుద్దీన్

అబిడ్స్: గృహనిర్మాణదారులు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకుని ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అబిడ్స్ 14వ సర్కిల్ ఏసీపీ సయ్యద్ సైదుద్దీన్ అన్నారు. గత కొన్ని నెలల పాటు ఏసీపీగా విధులు నిర్వహించిన సాంబయ్య బదిలీ కావడంతో అల్వాల్ నుంచి బదిలీపై వచ్చిన సయ్యద్ సైదుద్దీన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు తీసుకోకుండా ఎవరైనా ఇళ్ల నిర్మాణాలు చేపడితో వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో పర్యటించి తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



బీజేపీ నాయకులతో టి.అమర్‌సింగ్

గోల్కొండ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దెబ్బకు పాలక బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దుకాణం మూసుకోవాల్సిందేనని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం పలువురు నాయకులు గుడిమల్కాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు స్వచ్ఛమైన పాలన కోరుకుంటున్నారన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందన్న విషయం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో వారు బీఆర్‌ఎస్‌ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మరోవైపు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు గుండాయిజం చేస్తూ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ సమర్థవంతమైన పాలనతో దేశం పురోగతి సాధిస్తుండగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఆర్థికంగా పూర్తిగా దిగజారిందన్నారు. ఈసారి కార్వాన్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు సునీల్ యాదవ్, గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బిజ్వర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని పార్టీ అభ్యర్థి ఊరడి సత్యనారాయణ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన రియాసత్‌నగర్ డివిజన్‌లో పార్టీ కార్యకర్తలు, స్థానికులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..... ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం కార్యకర్తలపై ఉందన్నారు. 20 ఏళ్లుగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మజ్లిస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. చిన్నపాటి వర్షాలకే బస్తీలు నీట మునిగే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ గంజి వేణు, డివిజన్ అధ్యక్షుడు శివకాంత్, నాయకులు అర్జున్, శేఖర్ రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యకర్తలతో సమావేశమైన బీజేపీ చాంద్రాయణగుట్ట అభ్యర్థి ఊరడి సత్యనారాయణ

వైద్య, విద్యా రంగాల్లో తెలంగాణ టాప్



సరోజిని దేవి కంటి ఆసుపత్రిలో సీఎంఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రమేష్‌కుమార్ తదితరులు

గోల్కొండ: వైద్య, విద్యా రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతుందని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మెహిదీపట్నంలోని సరోజిని దేవి కంటి ఆసుపత్రిలో 40వ డాక్టర్ పి.రంగారెడ్డి సీఎంఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరోజిని దేవి కంటి ఆసుపత్రి దక్షిణ భారత దేశంలోనే కంటి వైద్య చికిత్సలో మొదటిస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి, గాంధీ మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ కె.రవిశేఖర్‌రావు, ఉస్మానియా మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ మోదిని, సరోజినిదేవి కంటి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.రాజలింగం, సివిల్ సర్జన్ డాక్టర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలకు ఆహ్వానం



మహ్మద్ సలావుద్దీన్ లోథీకి ఆహ్వాన పత్రం అందజేస్తున్న వాల్మీకి దేవాలయ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ బీఆర్‌ఎస్ చార్మినార్ నియోజక వర్గం అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోథీకి సుల్తాన్‌షాహీలోని వాల్మీకి మహర్షి దేవాలయ కమిటీ ప్రతినిధుల బృందం ఆహ్వాన పత్రిక అందజేసింది. తాము ప్రతి ఏటా వాల్మీకి జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఈసారి కూడా పెద్ద ఎత్తున నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మమత,అర్జున్, మౌనితా, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరవేస్తాం



బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్‌ను సన్మానించిన గోల్కొండ జిల్లా బీజేపీ నాయకులు

జియాగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం గోల్కొండ జిల్లా, జియాగూడ బీజేపీ నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ..... కార్వాన్ నియోజకవర్గంలో భారతీయ జనతాపార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ డైరీసెల్ కన్వీనర్ శివకుమార్, యాదవ్, జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాజ్‌పోల్, సంతోష్, భాస్కర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వి వదిలేశారు..

అబిడ్స్: ప్రముఖ వ్యాపార కేంద్రమైన బేగంబజార్ వైశ్య భవన్ ఎదుట జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్లు తవ్వి మళ్లీ నిర్మించకపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 40 రోజుల క్రితం రోడ్లు తవ్విన అధికారులు ఎంతవరకు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ వ్యాపార కేంద్రంలో ప్రతిరోజు నగరంతో పాటు రాష్ట్రానికి చెందిన వేలాదిమంది వ్యాపార క్రయ విక్రయాలు చేస్తారు. వారంరోజుల్లో కొత్త రోడ్లు నిర్మిస్తామని వ్యాపారులకు చెప్పిన జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆ తరువాత పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీపావళి 15 రోజులే ఉండడంతో వ్యాపారాలు ఎలా కొనసాగుతాయని వారు ప్రశ్నిస్తున్నారు. వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని లేని పక్షంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీకి ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు.



బేగంబజార్ వైశ్య భవన్ ఎదుట పాతరోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

పాలస్తీనాపై కాల్పులు ఆపాలి



గౌలిపురా: పాలస్తీనాపై వెంటనే కాల్పులు ఆపాలని డిమాండ్ చేస్తూ పాతబస్తీ తలాబ్‌కట్టాకు చెందిన స్థానిక ముస్లింలు శుక్రవారం పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. చేతుల్లో ప్ల కార్డులు పట్టుకుని పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలిపారు.శుక్రవారం సామూహిక ప్రార్థనల అనంతరం భవానీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మసీద్–ఈ–హిదాయత్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నోడల్ అధికారి కోట్ల వెంకట్‌రెడ్డి

అబిడ్స్: రాజకీయ పార్టీలతో పాటు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని, వాటిని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల పోలీసు బందోబస్తు నోడల్ అధికారి ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ రౌడీషీటర్లను బైండోవర్ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 234 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10 నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 17 ప్రాంతాల్లో 47 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించినట్లు తెలిపారు. మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ మూడు బృందాలుగా ఏర్పడి వాహనాల తనిఖీలు చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల నాయకులందరూ ప్రచారం కోసం 48 గంటల ముందు ఆర్‌ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది విచారణ చేపట్టి వెంటనే అనుమతులు ఇస్తారని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ప్రతిరోజు తనిఖీలు చేస్తున్నామని వ్యాపారులు రూ. 50 వేలకు పైగా నగదు తీసుకెళ్లాల్సి వస్తే హైదరాబాద్ ఎన్నికల అధికారి వద్ద అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతులు ఉన్నవారు అనుమతి పత్రాలను, రశీదులను వెంట ఉంచుకోవాలన్నారు.